కోరమండల్ హౌరా స్టేషన్‌లో ఆగింది.

'వాట్ కలకత్తా థింక్స్ టు డే ఇండియా థింక్స్ టుమారో'. అట్లాంటి కలకత్తాని చూడాలన్న ఆశ ఈనాటి కాదు.

మా వారు, నేను, పిల్లలు దిగి బయటకు వచ్చాం. స్టేషన్‌లో, స్టేషన్ బయట జన ప్రవాహాన్ని చూసేసరికి కళ్ళు తిరిగాయి. బెంగుళూరులో ఉన్న వాళ్ళ కిగి షాక్ ట్రీట్‌మెంట్. టాక్సీ మాట్లాడుకొని విపరీతమైన రద్దీ ఉన్న హౌరా బ్రిడ్జిని నెమ్మదిగా, అతి నెమ్మదిగా అసహనం పెరిగిపోతూండగా దాటుకొని హొటల్‌కి చేరేసరికి చాలా నిస్త్రాణగా అనిపించింది. కలకత్తాలో ఉన్న రెండు రోజులు చాలా విజ్ఞానవంతంగా గడచిపోయాయి. విపరీతమైన దరిద్రం, శరణార్థుల జీవితాలు, మరోవైపు కళలు - అందుకే విదేశీయులు కూడా కలకత్తాని చూడటానికి ఇష్టపడతా రనుకుంటాను. ఎవరిని ఏది అడిగినా స్పీచ్ ఇస్తున్నట్లు ఓపిగ్గా మాట్లాడటం, కూలివాడిని కదిలించినా సిద్ధాంతాలు మాట్లాడబోతున్నట్లు కనబడటం నిజంగా నాకు చాలా నచ్చింది. టూరిస్ట్ బస్‌లో కలకత్తాని పూర్తిగా చూశాము.

డార్జిలింగ్ ప్రయాణానికి న్యూ జలపాయగురి ట్రెయిన్ ఎక్కటానికి హౌరా స్టేషన్‌కి వచ్చాము. రైలుకి ఇంకా మూడు, నాలుగు గంటల వ్యవధి ఉంది. హౌరా బ్రిడ్జి దాటటానికి ముందుగా బయలుదేరి వచ్చాము.

వెయిటింగ్‌రూమ్‌లో కూర్చుని ఉండగా



# రాజకీయం

రజనీ సుబ్రహ్మణ్యం

తెలంగాణా యాసతో తెలుగు మాట్లాడుతూ ఒకతను పలకరించాడు. మంచి బట్టలు వేసుకొన్నట్లున్నా చాలా దీనంగా కనిపించాడు. పక్కన ఇద్దరు పిల్లలు. ఆయన తాత, తండ్రి సుభాష్ చంద్రబోసు ఐ.ఎన్.ఏ.లో ఉండి స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారట. ఇంగ్లీషు వాళ్ళు వాళ్ళకి ఆజన్మ ఖైదు వేసి అండమాన్‌కి పంపారట అప్పుడే యౌవనంలో అడుగు పెడుతున్న ఈయన తండ్రితో పాటు అండమాన్స్ వెళ్ళిపోవాల్సి వచ్చిందట. అక్కడే జీవనోపాధి కల్పించుకొని, సంసారాలు ఏర్పరుచుకొని ఇన్నేళ్ళ తరువాత మనవళ్ళకి ఇండియా చూపించాలని తీసుకొని వచ్చాడట. పూజ టైమ్ కాబట్టి కలకత్తా ని చూసి హైదరాబాదు వెళ్ళి పూర్వీకులని కలుసుకోవా లనుకొన్నారుట.

"షిప్ పాస్, తెచ్చుకొన్న రెండు వేల రూపాయలని స్టేషన్‌లో ఎవరో కొట్టేశారు. ఇంటికి టెలిగ్రామ్ ఇచ్చాను. పూజటైమ్ కాబట్టి కలకత్తాలో ఏ ఆఫీసూ పని చేయటంలేదు. చేతిలో పైసా కూడా లేదు. ఎవరో సుభాష్‌బాబు అన్న శరత్ చంద్రబోసుని కలుసుకొంటే సహాయం చేస్తారన్నారు.

ఒక ఆంధ్రుడికి, భారతీయుడికి మాతృభూమిలో ఎట్లాంటి సత్కారం లభించింది! అతనికి కొంత డబ్బు ఇచ్చి పిల్లలకి తినుబండారాలు కొనిపెట్టి సహాయం చేశాం - అనుకొన్నాం. కానీ అది తృణప్రాయం. ఆయన దగ్గర ఉన్న ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పంపిన పత్రాలు వెక్కిరిస్తున్నట్లు కనపడ్డాయి.

మేము బయలుదేరినప్పుడు వెస్ట్ బెంగాల్ అంత వరదల్లో ఉంది. పక్కన డార్జిలింగ్‌లో అనిశ్చిత పరిస్థితి కొంచెం భయపెడుతూ ఉంది. అయినా ధైర్యం చేసి బయలుదేరి వచ్చాం. ట్రెయిన్ ఆలస్యం అయి న్యూ జలపాయగురికి చేరేసరికి మూడు గంటలైంది. టిఫిన్ కానిచ్చి బయటకు వచ్చాం.

టాక్సీ వాళ్ళు, రిక్షా వాళ్ళు చుట్టుముట్టారు. ఈయన డిఫెన్స్‌లో ఉన్నారు కాబట్టి మిలిటరీ వెహికల్‌కి ప్రయత్నించారు.

"ఇంకో రెండు, మూడు గంటలు ఏ వానూ బయలుదేరదట" అన్నారు నిరాశగా.

రిక్షాలు మాట్లాడుకొని అరగంటలో సిలిగురి చేరుకొన్నాం. బస్‌లో సిలిగురి నుంచి డార్జిలింగ్ చేరటానికి మూడు గంటల ప్రయాణం. లాండ్‌స్లైడ్స్ వలన అన్ని మార్గాలూ మూసుకొని ఒకే మార్గం ఆపరేట్ అవుతోందన్నారు. ఆఖరి బస్ ఒకటే ఉంది. ఇంకో చిన్న బండి లాండ్ రోవర్‌లో నలుగురైదుగురు, ఒక సర్దార్‌జీ వెళ్తున్నారు. సర్దార్‌జీ మొహంలో సాత్వికతే లేదు. పెద్ద కళ్ళు, గడ్డం, మీసం. ఆ బండిలో మాకు చోటు సరిపోదని బస్‌లో ఎక్కాం. బస్ నిండే వరకు ప్రయాణం మొదలు కాలేదు. పిల్లలు కూడా ఎంజాయ్ చేసే వయసులో ఉన్నారు కాబట్టి ఎక్సైటింగ్‌గా ఉన్నారు. లాండ్‌స్లైడ్ వల్ల ప్రయాణం ఆరు గంటలు పడుతుందని ముందే డ్రైవర్ చెప్పాడు. బస్ కొంచెం దూరం వెళ్ళేసరికి బాగా చీకటి పడిపోయింది. ఈయన బస్‌ని పరికించి చూస్తున్నారు. బస్‌లో టూరిస్టులు లేరు. అందరూ స్థానికులే. ఈ ఆరు గంటల ప్రయాణంలో అందరూ అక్కడ అక్కడ దిగిపోతున్నారు. ఏమీ కనపడకపోయినా నేనూ, పిల్లలు హాయిగా చూస్తూ కూర్చున్నాం.

'ఇంకో ముగ్గురు మట్టుకే ఉన్నారు. వీళ్ళు కూడా డార్జిలింగ్ వరకు వస్తారో, రారో. రాత్రిపూట ప్రయాణం అనవసరంగా పెట్టుకొన్నాం" అన్నారు మావారు దిగులుగా.

నాకు ఆయన మాటలు వినగానే భయం మొదలైంది. ఈ గూర్ఖా డ్రైవర్, హెల్పర్స్ మమ్మల్ని చంపి లోయలో పడేసి, డబ్బు, నగలు పట్టుకుపోవటం ఖాయం అనిపించింది. ఎక్కడి తెలుగువాళ్ళం, మాకు ఈ గూర్ఖా లాండ్‌లో చావు రాసిపెట్టి ఉందని పరిపరివిధాల ఆలోచనలు. మధ్యలో ఒక నేపాలీ గైడ్ ఎక్కాడు. సరిగ్గా హోటల్ ముందు ఆపాడు డ్రైవర్. పదకొండు గంటల సమయంలో - ఎముకలు కొరికే చలిలో - డార్జిలింగ్ మీద కాలు మోపాం. గైడ్ హోటల్ కైలాష్‌కి తీసుకెళ్ళి మేనేజర్‌కి మమ్మల్ని అప్పజెప్పి వెళ్ళిపోయాడు.

నాకు విపరీతమైన ఆకలిగా ఉంది.

"టూరిజం పూర్తిగా కొలాప్స్ అయింది. ఈ రాత్రికి తిండి కూడా దొరకదు" అన్నాడు పెద్దవాడు గోపి.

తిండి లేకపోయినా పర్వాలేదు. సురక్షితంగా చేరాం అని గూర్ఖా డ్రైవర్‌కి మనసులో ధన్యవాదాలు చెప్పుకొని నిద్రపోయాం.

మర్నాడు ఏడు గంటలకి బయటకు వచ్చేసరికి ఎదురుగా ఉన్న చిన్న రైల్వే స్టేషన్, రోడ్డు, ఇళ్ళు అంత మంచులో కూరుకుపోయి ఉన్నాయి. రోడ్డుమీద స్వెట్టర్స్ వేసుకొని చకచకా నడిచిపోతున్నారు జనం. అందరూ అందంగా, బలిష్ఠంగా యూరోపియన్ ఫేషన్స్‌తో ఉన్నారు. చూస్తుంటే ఇంగ్లీష్ సినిమాలో సెట్టింగ్‌లా అనిపించింది. ఇంకొంచెం పరికించి చూడగా కొంచెం పక్కగా నిలబడి చూస్తున్న సర్దార్‌జీ కనిపించాడు.

"నా పేరు అజిత్‌పాల్ సింగ్. మాది కులూ, మనాలి" అని పరిచయం చేసుకొన్నాడు.

ఆ రోజంత మాతోనే తిరిగాడు. కాశ్మీర్‌లో అమ్మాయిలు గులాబీ రంగులో చెక్కినట్లుగా కనిపిస్తారు. ఇక్కడ అమ్మాయిలు బ్లంట్ ఫీచర్స్‌తో ఆరోగ్యంగా, బలిష్ఠంగా కనిపిస్తారు. ఇదో అందం. అప్పుడు గుర్తుకు వచ్చి అడిగాను సింగ్‌ని- "పెళ్ళి అయిందా?" అని. ఏదో మొహమాటంగా అడిగాను గానీ పెళ్ళి, పెద్ద సంసారమే ఉంటుందనుకొన్నాను.

"ఇంకా కాలేదు, నాకు ఇరవై నాలుగేళ్ళే" అని చెప్పాడు నవ్వుతూ.

రాత్రి చలిలో అతని రూమ్‌లో కూర్చుని మావారు, అతను డ్రింక్స్ తీసుకోవటం మొదలుపెట్టారు.

"ఒరేయ్ మీ నాన్న కోపిష్ఠి. అతను సర్దార్‌జీ. పైగా డ్రింక్స్ ఒకటి. ఏదైనా వాదనలో దిగి చంపుకోరు కదా?" అన్నాను పిల్లలతో.

నే నేదో జోక్ వేసినట్లు నవ్వారు.

డార్జిలింగ్ అందాలు, టెన్సింగ్ నార్గే ప్రాక్టీస్ చేసిన రాక్ చూసినప్పటి అనుభూతి చెప్పాలంటే అక్షరాలే కరువు. మిరిక్‌లో కొంచెం గొడవ స్టార్ట్ అయిం దన్నారు. వెంటనే బయలుదేరి సిలిగురి వచ్చేశాము. పగలు కాబట్టి ఆ ఘాట్‌రోడ్ ప్రయాణం అద్భుతంగా అనిపించింది. పేరు తెలియని పచ్చని చెట్లు, వళ్ళు, స్వచ్ఛమైన నీటితో సెలయేళ్ళు, అగాధమైన లోయలు ఈ ప్రకృతిలో కలిసిపోతే ఎంత బాగుంటుం దనిపించింది. ఆ మరునాడు ఉంది మేము ఎక్కాల్సిన ట్రెయిన్. నేపాల్ బార్డర్ వెళ్దామని సర్దార్‌జీ ప్రోగ్రామ్ చెప్పాడు. అతను కూడా మాతోపాటు సిలిగురి వచ్చి హోటల్‌లో ఉన్నాడు. ఖాట్మండు వెళ్ళలేదన్న బాధలో ఉన్న మాకు అది ఎంతో ఆనందా న్నిచ్చింది.

మర్నాడు నేపాల్ బార్డర్‌కి బస్‌లో వెళ్ళాం. దారిలో నక్సల్‌బరీ వచ్చింది. నక్సలైట్ మూమెంట్ పుట్టిన ఆ ఊరు చూస్తుంటే తమాషాగా అనిపించింది. బార్డర్ దాటి దులాబరిలో ఫారిన్ గూడ్స్ కొనుకొన్నాం. సర్దార్‌జీ, మేము కలిసి రావటం షాపుల వాళ్ళకి ఆశ్చర్యంగా అనిపించింది. నిజంగా సర్దార్‌జీ మా ఫామిలీ మెంబర్ అయిపోయాడు.

సాయంత్రం ట్రెయిన్ ఎక్కాము. కలకత్తాలో అతను 'బై' చెప్పి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోతూంటే చాలా బాధనిపించింది. మేము మద్రాస్ వెళ్ళే ట్రెయిన్ ఎక్కాము.

మనం మనం ఒకటి. భారతీయులం - గొప్ప ఫీలింగ్. ఆంధ్రులు, మహమ్మదీయులు, బెంగాలీలు, సిక్కులు ఇంకా ఎందరో కలిసిమెలిసి ఏకోదరుల్లా బ్రతుకుతూంటే ఈ కుటిల రాజకీయాలు విడదీస్తున్నాయి. శత్రుత్వాలు కలిపిస్తున్నాయి. ఈ స్వార్థానికి అంతులేదా? ★

